మహానందిలో పోటెత్తిన భక్తులు



జిల్లా న్యాయాధికారి కె.వాసు దంపతులకు సత్కారం

మహానంది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంతోపాటు ఆదివారం కావడంతో మహానంది క్షేత్రం వేలాది మంది భక్తులతో పోటెత్తింది. తెల్లవారు జామునే ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతోపాటు రెండో ప్రాకారంలోని కోనేర్లలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం మహిళలు ఉసిరి చెట్టు వద్ద, ఆలయం ముందు భాగంలో కార్తీక దీపాలు వెలిగించారు. పరమశివుని దర్శనం కోసం రెండు గంటల పాటు క్యూలో నిల్చోవాల్సి వచ్చింది. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధులు దర్శనం వేళల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వయంగా పర్యవేక్షించారు. కార్తీక మాసం పురస్కరించుకుని మహానంది క్షేత్రంలో నంద్యాల జిల్లా న్యాయాధికారి కె.వాసు దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. పూజల అనంతరం శాల్వతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.



కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు



మహానందిలో దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు



శ్రీశైలం జలాశయం

హైదరాబాద్‌లో కృష్ణా బోర్డు కార్యాలయం

కర్నూలులో కృష్ణా బోర్డు పెట్టాలి..!

- శ్రీశైలం కేంద్రంగా తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ
- ఐఏబీలో ఎంపీ, ఎమ్మెల్యేలు తీర్మానం చేస్తారా?
- రబీ సాగునీటిపై స్పష్టత కావాలి
- నేడు సాగునీటి సలహా మండలి సమావేశం

కర్నూలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాలు పంపిణీకి కేంద్రం శ్రీశైలం ప్రాజెక్టు. నీటి వివాదాలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించాలంటే అందుబాటులోనే కృష్ణా బోర్డు ఉండాలి. అది కర్నూలులో ఏర్పాటు చేస్తేనే ప్రయోజనకరంగా ఉంటుందని రాయలసీమ సాగునీటి నిపుణులు దశాబ్ద కాలంగా డిమాండ్ చేస్తున్నారు. కానీ ఇందుకు విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. కృష్ణా జలాలు పంపిణీ, నీటి వివాదాల పరిష్కరం కోసం కర్నూలులోనే కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కృష్ణా బోర్డు) పెట్టాలని సీమ రైతులు కోరుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలంటే నేడు జరగనున్న రబీ సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో ఏకాభిప్రాయంతో తీర్మానం చేయాలి. డిసెంబరు 3న జరిగే కేఆర్ఎంబీ సమావేశం అజెండాలో పెట్టి ఆమోదించేలా సీఎం చంద్రబాబును ఒప్పించాలి. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువ, కేసీ కాలువ కింద రబీ సాగునీటిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను 2014లో ఆనాటి కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలుగా విభజించారు. రెండు రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న కృష్ణా, గోదావరి నదుల నీటి పంపకాలు, వివాదాల పరిష్కరం కోసం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 పార్ట్ 9 సెక్షన్-86 ప్రకారం కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కృష్ణా బోర్డు), గోదావరి నదీయాజమాన్య బోర్డు (గోదావరి బోర్డు) ఏర్పాటు చేశారు. గోదావరి బోర్డు తెలంగాణలో, కృష్ణా బోర్డు ఏపీ కేంద్రంగా నిర్వహించాలని విభజన చట్టంలో పొందుపరిచారు. ఈ రెండు బోర్డులు కేంద్ర జలవనరుల శాఖ పరిధిలో పని చేసే స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలు. రాష్ట్ర విభజన తరువాత పదేళ్లు ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో కృష్ణా బోర్డు ఏర్పాటు చేసిన అక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగించారు. కర్నూలులో కృష్ణా బోర్డు పెట్టాలని రాష్ట్ర విభజన నాటి నుంచి రాయలసీమ సాగునీటి నిపుణులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కర్నూలు, విజయవాడ కాకుండా కృష్ణా నదికి ఏమాత్రం సంబంధమే లేని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నాటి సీఎం జగన్ నిర్ణయంపై రాయలసీమ రైతు, ప్రజా సంఘాలు భగ్గుమన్నాయి. ఈ క్రమంలో కర్నూలులో ఏర్పాటు చేయడమే సముచితమని మెజార్టీ సాగునీటి నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 7లో..

పేదవర్గాలకు సహకారం అందించాలి

విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి

7లో..



మల్లన్న కొండపై కార్తీక సందడి

నేడు లక్ష దీపోత్సవం



దీపారాధన చేస్తున్న మహిళలు

శ్రీశైలం, నవంబరు 24 (ఆంధ్రజోతి): శ్రీశైలం మహా క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం ఆదివారం సెలవు రోజు కావడంతో క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. దీంతో క్షేత్ర పురవీధులన్నీ భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. వేకువ జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ ఉత్తర వీధి, గంగాధర మండపం ఎదుట విశేష పూజలు నిర్వహించుకుని పెద్ద సంఖ్యలో దీపారాధనలను జరిపారు. స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్తీకమాసంలో చివరి సోమవారం సందర్భంగా సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



ధర్మపథంలో కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

చేనేతలకు శుభవార్త

- త్వరలో ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు
- బనవాసి దగ్గర టెక్స్‌టైల్ పార్కు స్థలాన్ని పరిశీలించిన మంత్రి



మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఎమ్మిగనూరు చేనేతలు ఎదురు చూస్తున్న టెక్స్‌టైల్ పార్కు కల ఎట్టకేలకు సాకారం కానుంది. ఆదివారం పట్టణంలో నిర్వహించిన భక్త కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఎమ్మిగనూరులో త్వరలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కలెక్టర్ దగ్గర ఫైల్ ప్రాసెసింగ్‌లో ఉందని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయంలో టెక్స్‌టైల్ పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ పరిశ్రమ ద్వారా ఐదువేల మందకి ఉపాధి దక్కుతుందన్నారు. దివంగత బీవీ మోహన్ రెడ్డి కలను ఆయన కుమారుడు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి నెరవేరుస్తున్నట్లు ఆమె తెలిపారు. తన చిన్న తనంలోనే బీవీ మోహన్ రెడ్డి ఎమ్మెల్యే అవుతానని జ్యోస్యం చెప్పారని, తన తండ్రితో బీవీ మోహన్ రెడ్డికి ఉన్న అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. ఎమ్మిగనూరుతో పాటు అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, పామిడి ప్రాంతాల్లో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాయలసీమలో సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు తెచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. కర్నూలు జిల్లాల్లో బీసీ హాస్టళ్లు, బీసీ రెసిడెన్సియల్ స్కూల్స్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కురువలు తమ పిల్లలకు విద్యనందించాలని ఆమె పిలుపునిచ్చారు. మాదాసి కురువను ఎస్సీ జాబితాలో చేర్పించే విషయంపై ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్‌తో చర్చించామన్నారు. కర్నూలు జిల్లాలోని నాయకులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారని చెప్పారు.

- ఎమ్మిగనూరులో ఘనంగా భక్త కనదాసు జయంతి వేడుకలు

ఎమ్మిగనూరు పట్టణంలోని ఇండస్ గ్లోబల్ పాఠశాల ఆవరణంలో ఆదివారం కురువల ఆరాధ్యదైవం భక్త కనకదాసు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ఎంపీలు బీకే పార్థసారథి, బస్తిపాటి నాగరాజు, కురువలు పెద్దఎత్తున పట్టణ పురవీదులగుండా బైక్‌లపై ర్యాలీ నిర్వహించి సభాస్థలానికి చేరుకున్నారు. అక్కడ భక్త కనకదాసు చిత్రపటానికి పూజలు చేశారు. ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు పదవిని బీసీల్లో కురువలకు ఇస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, డైరెక్టర్ రామకృష్ణ, జడ్పీ మాజీ ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు, నాయకులు మద్దిలేటి, బీరప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలు చేస్తే చర్యలు: కలెక్టర్



రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు, వృత్తివిద్యా కోర్సు కళాశాలల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. విద్యార్థులు రుసుములు చెల్లించలేదనే కారణంలో హాల్‌టికెట్లు జారీ చేయకపోయినా, ఒరిజనల్ ధ్రువపత్రాలు ఇవ్వకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జ్ఞానభూమి పోర్టల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని కలెక్టర్ వివరించారు. హాల్‌టికెట్లు ఇవ్వకపోయినా, ధ్రువపత్రాలు జారీ చేయకపోయినా కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కోఆర్డినేషన్ సెంటర్ ఫోన్ నెంబర్లకు 08514-293903,08514-293908 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం'



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న తులసిరెడ్డి, ఫిరోజ్

నంద్యాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ అన్నారు. సీఎం సహాయ నిధి కింద రూ.12.30 లక్షలు మంజూరు కాగా మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ ఆదేశాల మేరకు ఆదివారం టీడీపీ కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. తులసిరెడ్డి, ఫిరోజ్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వం నుంచి అందించే సహాయ నిధి కొంతమేర బాధితులకు ఉపశమనంగా ఉంటుందని అన్నారు. అభివృద్ధి, ప్రజాసంక్షేమ పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, ఆ దిశగా చంద్రబాబు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జైనాబీ, శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ మిద్దె హుసేని, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇజితెమా పనుల పరిశీలన



ముస్లింలతో కలిసి పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్

ఆత్మకూరు రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివారులోని మదరసా ప్రాంతంలో ఆత్మకూరు ముస్లిం మైనార్టీల సహకారంతో జనవరి 7న తబ్లిగీ ఇజితెమాను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు 16 వవార్డు కౌన్సిలర్ విజయ్ చౌదరి తన వంతు చేయూతగా తన సొంత ఎక్స్‌వేటర్, ట్రాక్టర్లతో ఇస్తెమా జరిగే ప్రాంతంలో ఉచితంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం పనులను ముస్లింలతో కలిసి పరిశీలించారు. విజయ్ చౌదరికి ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ

నంద్యాల క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు, నేరచరిత్ర గలవారు, చెడునడత గలవారు సత్ప్రవర్తనతో మెలగాలని నంద్యాల డీఎస్పీ పి.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల పట్టణంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి కౌన్సెలింగ్ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని, ప్రశాంత సమాజానికి పాటుపడాలన్నారు. పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రవర్తనలో మార్పురాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉందని చెప్పారు. కౌన్సెలింగ్‌కు రానివారు తప్పనిసరిగా సహేతుకమైన కారణం పోలీస్ అధికారులకు చెప్పాల్సి ఉంటుందన్నారు. కౌన్సెలింగ్‌లో డీఎస్పీతో పాటు సీఐలు సుధాకర్‌రెడ్డి, ఇస్మాయిల్, సూర్యమౌళి, అస్రార్‌బాషా పాల్గొన్నారు.

'కార్మిక ప్రదర్శనను జయప్రదం చేయాలి'

నంద్యాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నంద్యాలలో జరిగే కార్మిక, కర్షక ప్రదర్శనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్‌గౌస్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ వీధుల్లో బైకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ నూనెపల్లె ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి సాయిబాబానగర్, టెక్కె, పద్మావతినగర్ మీదుగా మున్సిపల్ ఆఫీస్ వరకు కార్మిక, కర్షక ప్రదర్శన అనంతరం మున్సిపల్ కార్యాలయంవద్ద జరిగే సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు బాల వెంకట్, వెంకటలింగం, సుబ్బారావు, జైలాన్ తదితరులు పాల్గొన్నారు.

'రజకుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి'

పాణ్యం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): రజకులను సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని నంద్యాల జిల్లా రజక సేవా సమితి అధ్యక్షుడు నాగరాజు కోరారు. ఆదివారం పాణ్యం జ్వాలా లిటిల్ ఏంజల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా రజక కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రజక సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వన భోజనం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారి శ్రీనిత్య ప్రదర్శించిన నృత్యం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. సమితి గౌరవాధ్యక్షులు రైల్వే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కౌలూరు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ముదిగేడు నాగేంద్ర, కంబగిరిస్వామి, కోశాధికారి మల్లికార్జున, వెంకటేశ్వర్లు, మద్దయ్య, మద్దిలేటి, రామకృష్ణ, వెంకటసుబ్బయ్య, నాగరాజు, తిమ్మయ్య, శీను, రామాంజనేయులు, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, రజకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

● శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలు ● రక్షణ గోడలు లేని వైనం



బ్రాహ్మణకొట్కూరు వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

నందికొట్కూరురూరల్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గంలోని గ్రామాలను కలిపే వంతెనలు, మండల కేంద్రాలను, పట్టణాలకు వెళ్లే బ్రిడ్జీలు, అలాగే కేజీ రహదారిపై కూడా బ్రిడ్జీలు కొన్ని శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. రక్షణ గోడలు పగిలి బీటలు బారి ఛిద్రమై ఎంతో ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు కూలుతాయోనన్న భయంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు వద్ద కేజీ రహదారిపై ఎన్నో ఏళ్లుగా రక్షణగోడలు లేకుండగా శిథిలావస్థకు చేరింది. అయినప్ప టికీ దానిపైనే కర్నూలు జిల్లా కేంద్రానికి వెల్ల వలసి వస్తోంది. అలాగే వడ్డెమాను గ్రామం వద్ద కూడా వడ్డెమాను గ్రామం నుంచి అల్లూరు మీదుగా నందికొట్కూరు వెళ్లాలంటే ఈ శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిపైనే వెళ్లాల్సి ఉంది.



వడ్డెమాను గ్రామం వద్ద దెబ్బతిన్న బ్రిడ్జి

మిడూతూరు మండలంలోని చింతలపల్లె గ్రామానికి వెళ్లాలంటే బ్రిటిష్ కాలంలో కట్టిన బ్రిడ్జిపైనే వెళ్లాలి. దీనికి కూడా రక్షణ గోడలు లేవు. అలాగే మిడుతూరు మండల కేంద్రం నుంచి తలముడిపి వెళ్లే రహదారిలో కూడా ఇలాంటి బ్రిడ్జి ఉంది.

పాములపాడు మండ లంలో కోల్స్ ఆనందాపురం గ్రామానికి వెళ్లాలంటే కేసీ కెనాలు మీద బ్రిటీష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జి పై నుంచే వెళ్లాలి. దీనిపై కొత్త బ్రిడ్జికట్టాలని గత 25 సంవత్సరాల నుంచి నాయకులకు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.



మల్యాల వద్ద కేసీ కెనాల్ పై హంద్రీనీవా ప్రాజెకు వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

కొత్తపల్లె మండలంలోని శివపురం గ్రామం వద్ద ఎద్దుల వాగుపై పాతకాలం నాటి లో లెవెల్ వంతెన ఉంది. దీనిపై నుంచి దాదాపుగా ఆరు గ్రామాల ప్రజలు వెళ్లాల్సి ఉంది. వర్షం వస్తే చాలు రాకపోకలు నిలిచిపోతాయి. పాత వంతెనలు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొత్త బ్రిడ్జీలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవాలు



యాదవ సంఘం ఆధ్వర్యంలో వనభోజనం



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీఐ మధుసూదన్ గుప్తా కుటుంబానికి మెమెంటో అందిస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఆదివారం వనభోజన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పద్మావతీ నగర్‌లో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆలయ అధ్యక్షుడు పార్థసారధికృష్ణ, విజయచంద్ర నిర్వహణలో చేపట్టారు. ప్రథమ నందీశ్వరాలయంలోని కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస ఆధ్వర్యంలో, బైటిపేటలోని గంగాభవానీ ఆలయ ఆవరణలో కుందూ నది ఒడ్డున రజక సంఘం ఆధ్వర్యంలో రజక సంఘం అధ్యక్షుడు జిల్లెల్ల శ్రీరాములు నిర్వహణలో, బ్రహ్మానందం ఈశ్వరస్వామి ఆలయంలో వీరశైవుల వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాలకు ముఖ్య అతిథిగా ట్రాఫిక్ సీఐ మధుసూదన్ గుప్తా, డాక్టర్ మధుసూదనరావు, రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, తదితరులు పాల్గొని వనభోజన కార్యక్రమాలను ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం నిర్వాహకులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు.

1న బలిజ వనభోజన మహోత్సవం

నంద్యాల రూరల్: వచ్చే నెల 1న పట్టణ సమీపంలోని మూలమఠంలో నిర్వహించే కార్తీకమమాస వనభోజన మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. బలిజల అభివృద్ధికి కలిసి కట్టుగా ముందుకు సాగుదామని బలిజ సంఘం ప్రతినిదులు పిలుపునిచ్చారు. ఆదివారం



రజక సంఘం ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను సన్మానిస్తున్న నిర్వాహకులు

నంద్యాల పట్టణంలోని బాల అకాడమీ స్కూల్‌లో కార్తీకమాస వనభోజన మహోత్సవ స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. బలిజ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ బలిజలు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఎదగడానికి విలువైన సూచనలు చేశారు. సమిష్టిగా ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం వనభోజన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నారాయణ, పసుపులేటి జనార్దన్. చలంబాబు, పడకండ్ల సుబ్రమణ్యం, నాగరాజు, దస్తగిరి, శ్రీనివాసులు, రవింద్రనాద్,తోట భూపాల్ పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

నంద్యాల క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీసీఎస్, త్రీ టౌన్ పోలీసులు ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. దాడుల్లో ఆరుగురు మట్కా బీటర్లను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న రూ.2లక్షల నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి తెలిపారు. ఆదివారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మట్కా నిర్వాహకుల అరెస్ట్ వివరాలను సీఐ సూర్యమౌళి వెల్లడించారు. పట్టణంలోని బైర్మల్ వీధికి చెందిన శ్రీనివాసులు, చింతరుగు ప్రాంతానికి చెందిన చిన్న రామయ్య అలియాస్ ఖలీల్, పట్టణంలోని హరిజనపేటకు చెందిన హనుమంతును అరెస్టు చేశారు. అలాగే కర్నూలు టౌన్ గణేష్‌నగర్‌కు చెందిన రెహమాన్, మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపురం గ్రామానికి చెందిన అన్వర్‌బాషాను అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ.2లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సీసీఎస్ సీఐ సురేష్‌కుమార్, త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

'ప్రభుత్వ భూమిలోకి ప్రవేశించకూడదు'



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోరు ఏర్పాటు చేయించిన తహసీల్దార్

మిడుతూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకేసుల గ్రామంలోని సర్వే నెంబరు 552లో ఉన్న 10.28 ఎకరాలు ప్రభుత్వ భూమి అని, ఈ భూమిలోకి ఎవరూ కూడా ప్రవేశించకూడదని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. ఈ భూమిలోకి ఎవరైనా ప్రవేశిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్చరిక బోర్డు ఆదివారం ఏర్పాటు చేశారు. ఆయన వెంట వీఆర్వో సోఫీసాహెబ్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

'పదోన్నతి సమస్యలను పరిష్కరించాలి'



మాట్లాడుతున్న సీవీ ప్రసాద్

నంద్యాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల పదోన్నతుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని ఎస్పీజీ జూనియర్ కళాశాలలో ఏపీటీఎఫ్ అమరావతి జిల్లా కార్యవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. సీవీ ప్రసాద్ మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులకోసం సర్వీస్ రూల్స్ తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలన్నారు. అనంతరం నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా రవిప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశోక్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగార్జున, అదనపు కార్యదర్శిగా వీరన్న, కోశాధికారిగా మౌలాలి, ఉపాధ్యక్షులుగా సుబ్బరాయుడు, సదాశివయ్య, బాలకోటిరెడ్డి, కార్యదర్శులుగా అల్తాఫ్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర నాయకులు సూర్యుడు, నాగూర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కార్డన్ సెర్చ్



సీతారామపురంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ

నంద్యాల క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లలో ఏకకాలంలో కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం తెలిపారు. అనుమానిత ప్రాంతాలు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో పోలీస్ జాగిలాలతో విస్తృత తనిఖీలు చేపట్టామని చెప్పారు. అసాంఘిక, సంఘ విద్రోహశక్తుల ఆటకట్టించి నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో సరైన ధృవపత్రాల్లేని 17 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడంతోపాటు నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సంబంధిత గ్రామాల్లో గ్రామస్థులతో పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు.

మహానంది: మహానంది మండలంలోని సీతారామపురం గ్రామంలో ఆదివారం నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. గ్రామంలో అనుమానస్పద ప్రదేశాలతో పాటు ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. నంద్యాల రూరల్ సీఐ బి. శ్రీనివాసులరెడ్డి, మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, డాగ్ స్క్వాడ్ సిబ్బంది ఉన్నారు.

సిబ్బందికి శిక్షణ

ఆత్మకూరురూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరివేన గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో జిల్లా వ్యవసాయాధికారి మురళి కృష్ణ, ఏడీఏ ఆంజనేయ ఆధ్వర్యంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పాములపాడు, వెలుగోడు, కొత్తపల్లి మండలాల రైతు సేవా కేంద్ర సిబ్బందికి సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో భాగంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారికి అర్థమయ్యేలా వివరిస్తూ సలహాలు సూచనలు ఇవ్వాలని అన్నారు. అనంతరం వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలు, బోరు బావులలో నీటి సామర్థ్యాన్ని పెంచే విధానాలు, పంట ఉత్పత్తులు, తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయాన్ని సమకూర్చే పద్ధతులపై వారికి వివరించారు. అనంతరం శాస్త్రవేత్త రవి కిషోర్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న పంటలైన మినుము, శనగ, కంది పంటలలో వస్తున్న తెగుళ్ళు వాటి నివారణ పద్ధతులు గురించి సిబ్బందికి వివరించారు. డీఏఏటీసీ ఏవో హేమలత, ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు, కొత్తపల్లి మండలాల వ్యవసాయాధికారులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఫణీశ్వరరెడ్డి, పవన్‌కుమార్, మహేష్‌లు, ఆయా మండలాల ఏఈవోలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

ఆత్మకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గల ఓటరు నమోదు కేంద్రాలను ఆదివారం శ్రీశైలం నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సుధారాణి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2025 జనవరి 1 తేది నాటికి 18ఏళ్లు పూర్తయిన యువతకు కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక మండలంలోని నల్లకాల్వ, బాపనంతాపురం గ్రామాల్లోని ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఇదిలావుంటే పలు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ మధ్యలోనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో ఓటరు నమోదు కోసం వెళ్లిన యువతకు నిరుత్సాహమే మిగిలింది.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



ఆత్మకూరులో దేవతామూర్తుల అలంకరణ అయ్యప్పదీక్షాపరులు

ఆత్మకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని అయ్యప్ప స్వామి ఆలయంలో పడిపూజ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం పదునెట్టంబడిపూజ, ప్రాకారోత్సవం, కూష్మాండ బలి, పల్లకీ సేవ నిర్వహించారు. వేదస్వస్తి, మహా మంగళహారతితో ఉత్సవానికి ముగింపు పలికారు. భక్తులకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో అల్పాహార వితరణ చేపట్టారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అప్పయ్య దీక్షాపరులు వివిధ దేవతా మూర్తుల వేషాధారణలతో గ్రామోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు వద్ద ఉన్న జమ్మి చెట్టు ఆవరణలో అయ్యప్ప స్వామి భక్తులు మెట్ల పూజను వైభవంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి మాల ధారణ చేసిన వారికి, అక్కడికి విచ్చేసిన భక్తులకు కార్తీక మాస వనభోజనం నందికొట్కూరు పట్టణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదరెడ్డి, నందికొట్కూరు మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకరెడ్డి, నంది కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, వీహెచ్‌పీ నాయకులు అల్వాల బాలయ్య శ్రేష్టి పట్టణ ప్రముఖులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నందికొట్కూరులో అయ్యప్ప స్వామికి మెట్లపూజ చేస్తున్న భక్తులు

సంగమేశ్వరంలో పూజలు



లలిత సంగమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సప్తనదుల సంగమతీరంలో భక్తజన సందోహం నెలకొంది. కార్తీకమాసం ముగుస్తుండటంతో ఆదివారం ఉద్యోగులకు, విద్యార్థులకు సెలవు దినం కావడంతో రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి సంగమేశ్వరున్ని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ భక్తులతో అభిషేకాది క్రతువులు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే కొలనుభారతి సరస్వతి అమ్మవారిని కూడా కార్తీక మాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. విచ్చేసిన భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమ కమిటీనిర్వహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

నంద్యాల కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ పార్కులోని ఆయుష్‌యోగా సెంటర్‌లో భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగామాస్టర్ ఆనంద్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథులుగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ ఛైర్మన్ మారుతీకుమార్ తదితరులు పాల్గొన్నారు. సత్యసాయి జన్మదిన వేడుకలలో భాగంగా భజనలు, భక్తిగీతాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నేత్రదానం చేసిన వారి కుటుంబ సభ్యులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఘనంగా సన్మానం చేశారు.

'కూటమి ప్రభుత్వాలతోనే సుపరిపాలన'



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వరూపాచారి

బండిఆత్మకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వాలతోనే సుపరిపాలన సాగిస్తున్నాయని బీజేపీ మండల రిటర్నింగ్ అధికారి విశ్వరూపాచారి, ఏఆర్వో మౌళిబాషా అన్నారు. మండలంలోని పెద్దదేవళాపురం గ్రామం ఏకశిలా అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు చింతానాగేశ్వరరావు, ధనుంజయరెడ్డి మాట్లాడుతూ కేంద్రం ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, జీవనజ్యోతి, ప్రధాని ప్రమాద బీమాలాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసరెడ్డి, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీకొని ఇద్దరి దుర్మరణం

శుభకార్యానికి వెళ్తూ ఒకరు.. ఆలయం నుంచి వస్తూ మరొకరు..

కన్నీటిపర్యంతమైన మృతుల స్నేహితులు, బంధువులు





మృతిచెందిన చంద్రశేఖర్ ఖాదర్ బాషా

శిరివెళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. నంద్యాల పట్టణంలోని నడిగడ్డకు చెందిన షేక్ ఖాదర్ బాషా శిరివెళ్లలోని బంధువుల ఇంట్లో జరుగుతున్న ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు కారులో బయలుదేరాడు. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామ సమీపంలో కారు టైరు పేలడంతో అదుపు తప్పింది. దీంతో డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు దాటి కర్నూలుకు వెళ్తున్న చంద్రశేఖర్ కుటుంబం ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ కారు నడుపుతున్న షేక్ ఖాదర్ బాషా (24), మరో కారులోని చంద్రశేఖర్(65) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు చంద్రశేఖర్ భార్య ఈశ్వరమ్మ, కుమారుడు రవి కుమార్ తీవ్రంగా గాయపడడంతో వారిని 108 వాహనంలో నంద్యాల వైద్యశాలకు తరలించారు. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రమాదం చోటుచే సుకున్న తీరును పరిశీలించారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం నం ద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జాతీయ రహదారిపై వాహ నాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

చంద్రశేఖర్ రిటైర్డు ఎస్ఐ..

చంద్రశేఖర్ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, సంజామల, నందివర్గం తదితర పోలీస్ స్టేషన్‌లలో పని చేసి 2022లో ఎస్ఐగా పదవీ విరమణ పొంది శేష జీవితం గడుపుతున్నాడు. ఈ నెల 22వ తేదీన భార్య, కుమారుడితో కలిసి పుణ్యక్షేత్రాలు దర్శించుకునేందుకు కారులో బయలుదేరి వెళ్లారు. అరుణాచలేశ్వరుడి దర్శనానంతరం ఆదివారం ఉదయం కర్నూలుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఖాదర్ బాషా మాత్రం నంద్యాలలోని ఓ పేపర్ ప్లేట్ల తయారీ దుకాణంలో పని చేసేవాడు.

స్నేహితుడి మృతిని జీర్ణించుకోలేక..

కలిసిమెలిసి స్నేహం చేసిన మిత్రుడు ఖాదర్ బాషాను విగతజీవిగా చూడడంతో సహచర స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు ప్రజలను సైతం కంటతడి పెట్టించింది. శుభకార్యంలో సందడిగా గడపాల్సిన యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడన్న చేదు నిజాన్ని స్నేహితులు, బంధువులు జీర్ణించుకోలేకపోయారు. షేక్ ఖాదర్ బాషా మృతదేహాన్ని పంచానామా నిమిత్తం తరలించే సమయంలో వారి రోదనలు మిన్నంటాయి.

ప్రియాంక గాంధీ గెలుపు పట్ల హర్షం

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ అత్యధిక మోజార్టీతో గెలుపొందడం పట్ల డీసీసీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కాంగ్రె స్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వయనాడులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ అఖండ విజయాన్ని సాధించారని అన్నారు. భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రతిరూపం ప్రియాంక పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నారని తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొందన్నారు. రాష్ట్రంలో షర్మిలమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని తెలిపారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు భవిష్యత్‌లో అన్ని రాష్ట్రాల్లో పునరావతమవుతాయని అభిప్రాయపడ్డారు.

సిల్వర్‌జూబ్లీలో జీసీటీఏ ఎన్నికలు

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు సంబంధించిన ప్రభుత్వ కాలేజీ టీచర్స్ అసోసియేషన్(జీసీటీఏ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 73 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. అధ్యక్షులుగా డాక్టర్ డాలు నాగన్న, సెక్రటరీగా డాక్టర్ దళవాయి శ్రీనివాసులు, మహిళా కార్యదర్శిగా ఎ.జయలక్ష్మి, కోశాధికారిగ జి. దేవదానం, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా సీ. రమేష్, పర్యవేక్షణ అధికారిగా ఎస్. వెంకకృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా బలిజ సంఘం వనభోజనం



న్యాయవాది రామచంద్రరావును సత్కరిస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా సాగింది. నగర శివారులోని జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న విజ్ఞాన పీఠం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి కాపు, బలిజ, తెలగ, మున్నూరు కాపు కులాల వారు వందలాదిగా హాజరయ్యారు. కిసాన్ ఘాట్ సమీపంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం నుంచి విజ్ఞాన పీఠం వరకు బైకులు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉసిరిక చెట్టు వద్ద పూజలు చేసి వనభోజన కార్యక్రమాలను ప్రారంభించారు. నగర బలిజ సంఘం అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది రామచంద్రరావు హాజరయ్యారు. మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. అంతకు ముందు బలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రధాన కార్యదర్శి ఎం. రవికుమార్ రాయల్, కోశాధికారి శైలేష్ రాయల్, బలిజ సంఘం ప్రముఖులు ఆర్జా రామకృష్ణ, డాక్టర్ వై. సత్యనారాయణ, డా క్టర్ కుళ్లాయప్ప, చింత లపల్లి రామకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు, రాజారామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బలిజ యువజన సంఘం నాయకులు

పేదవర్గాలకు సహకారం అందించాలి

ఎమ్మెల్యే సుజనా చౌదరి

కమ్మసంఘం ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వనభోజనం



జిల్లా అధ్యక్షుడు కమ్మ కృష్ణమోహన్‌ని సత్కరిస్తున్న కమ్మ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేద వర్గాలకు వైద్య, విద్య, ఉపాధి రంగాల్లో సహకారం అందించడానికి కమ్మ సంఘం నాయకులు కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు నగరంలోని కాకతీయనగర్ కమ్మ సంఘం ప్రాంగణంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుజనా చౌదరి మాట్లాడుతూ పేద వర్గాలకు జిల్లా కమ్మ సంఘం ద్వారా తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ కమ్మ కులస్థులు తమతో పాటు ఇతర కులాల వారిని కూడా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన సమయంలోనూ బడుగు, బలహీన వర్గాల వారిని ప్రోత్సహించి రాజకీయంగా వారికి ఎన్నో అవకాశాలు కల్పించారన్నారు. ప్రతి ఒక్కరూ ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కమ్మ కృష్ణమోహన్ మాట్లాడుతూ అందరూ సమైక్యంగా ఉంటేనే సంఘం బలపడుతుందన్నారు. పారిశ్రామికవేత్త యార్లగడ్డ హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కుల సంఘాలు పనిచేయాలని సూచించారు. ఏపీ కమ్మ సేవా సమాఖ్య జనరల్ సెక్రటరీ బెజవాడ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేదవారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్మ సంఘం కార్యదర్శి పెనికలపాటి రాజశేఖర్, ఏపీ కమ్మ సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ మురుకొండ బోసుబాబు, కార్యదర్శులు వెలగ కోటేశ్వరరావు, తమ్మినేని రమేష్, మాంటిస్సోరి పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రాజశేఖర్, రిటైర్డ్ ఏఎస్పీ రామప్పగారి వెంకన్న చౌదరి, మాజీ అధ్యక్షుడు వడ్లమూడి చలమయ్య, మోదేపల్లి సుబ్బరాయుడు, కుసుపాటి రాజగోపాల్, మాజీ కార్పొరేటర్ జంపాల మధుసూదన్‌రావు, కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి, కల్యాణ మంటపం పర్యవేక్షకుడు కుసుపాటి బాబ్జి, అమిత్, యోగానంద హర్షవర్ధన్, చంద్రశేఖర్, కేశవరామ్ చౌదరి, సోంపల్లి శేఖర్, నాగేశ్వరరావు, పి.హనుమంతరావు చౌదరి, ఉన్నం వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక నృత్యాలు, మ్యాజిక్ షో, ఆటల పోటీలు అలరించాయి.

కురువలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కల్లూరు, నవంబరు 24: కురువలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నతస్థాయికి చేరాలని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు మండల మోడల్‌స్కూల్ సమీపంలోని బీరప్ప దేవాలయంలో చేపట్టిన 22వ కార్తీక వనభోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘం ప్రధాన కార్యదర్శి కె.రంగస్వామి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, కల్లూరు తహసీల్దారు కె. ఆంజనేయులు, గొర్రెల సంఘం చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు గడ్డం రామకృష్ణుడు, సత్యనారాయణమ్మ, అరుణకుమారి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదులో అప్రమత్తంగా ఉండాలి: జేసీ

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటర్ నమోదులో బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లు అప్రమత్తంగా పనిచేయాలని పాణ్యం రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. ఆదివారం కల్లూరు మండలం పరిధిలో రెండు రోజుల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులతో కలిసి జాయింట్ కలెక్టర్ 59, 60, 61, 62, 65, 66, 67, 68, 119, 120, 121 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ బి.నవ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని, చేర్పులు, మార్పులకు దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల ను పరిశీలించి ఓటరు నమోదులో పారదర్శకత పాటించాలన్నారు.

ఎంపీ బస్తిపాటికి సత్కారం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్ల, బీసీ రెసిడెన్షి యల్ పాఠశాలల భవనాల మరమ్మతుల కోసం తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.కోటి నిధులు కేటాయించిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును బీసీ వెల్ఫేర్ అధికారులు ఆదివారం సత్కరించారు. ఆయన నివాసానికి వెళ్లిన ఉద్యోగులు పుష్పగుచ్ఛం శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి వెంకటలక్ష్మి మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేసిన వెంటనే స్పందించి రూ.కోటి నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు శ్రీనివాసులు, ఆంజనేయులు, మహాలక్ష్మి, కనకలత, గిరిజ, శంకర్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ బస్తిపాటి నాగరాజును సత్కరిస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి, సిబ్బంది



ఎమ్మెల్యే గౌరు చరితను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణులు

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. ఆదివారం ఉల్చాల రోడ్ సమీపంలోని హిందూస్తాన్ నగర్ శ్రీగాయత్రీ విశ్వకర్మ వీరభద్ర ఆలయంలో ఈశ్వరిమాతా సేవా ట్రస్ట్ చైర్మన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన మొదటి కార్తీక వనభోజన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలు కె.క్రిష్ణవేణి, కె.పార్వతమ్మ, జనార్దన్ ఆచారి, రాఘువేంద్ర ఆచారి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుమ్మరుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే గౌరు



సమావేశంలో మాట్లాడుతున్న గౌరుచరిత

కల్లూరు, నవంబరు 24:(ఆంధ్రజ్యోతి): కుమ్మరుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. ఆదివారం స్థానిక నంద్యాల రోడ్ పుల్లారెడ్డి కాలేజీ సమీపంలోని ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో శాలివాహన కుమ్మర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గౌరుచరిత మాట్లాడుతూ క్మురుల సమస్యల పరిస్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు, రవీంద్ర విద్యాసంస్థల అధినేత గూడూరు పుల్లయ్య మాట్లాడుతూ కుమ్మరులు ఐకమత్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కె.సోమేష్, ప్రధాన కార్యదర్శి కె.బజారప్ప, గూడెంపాడు శ్రీనివాసులు, సంఘం నాయకులు నరసింహ బాబు, కే.లింగన్న, మధు, పెద్దఈశ్వర్, నాగేంద్ర, రామచంద్రుడు పాల్గొన్నారు.

ఐక్యత కోసమే కార్తీక వనభోజనం



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆయా కులాలు, సంఘాలలో సమైక్యత చాటడానికి కార్తీక మాస సామూహిక వన భోజన కార్యక్రమాలు తోడ్పడతాయని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బొడ్డువానిపల్లె ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో దాత పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సర్వజన కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డితో పాటు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వేరువేరుగా హాజరై ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో పాలకొలను, గుట్టపాడు సర్పంచులు చదువుల సుజాతమ్మ, నర్ల మోహన్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, పుసులూరు ప్రభాకర్ రెడ్డి, పుల్లారెడ్డి, పాల్గొన్నారు.

పిల్లలను క్రమశిక్షణతో పెంచండి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను క్రమ శిక్షణతో బాగా చదివించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు కుర్ణి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్కలమిట్ట శ్రీనివాసులు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వెంకన్నబావి ప్రాంగణంలో కుర్ణి కులస్థుల కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, కేపీ రాధాకృష్ణ, చెన్నప్ప, ఎం.రామదాసు, బి.కృష్ణ, నారాయణ, జగన్నాథం, సత్యనారాయణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుర్ణి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు

భార్య చేతిలో భర్త హత్య

కర్నూలు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో టీవీ-9 ప్రజానగర్ కాలనీలో చిన్న (27) అనే వ్యక్తిని అతని భార్య హత్య చేసింది. పోలీసుల వివరాల మేరకు.. నందికొట్కూరుకు చెందిన చిన్న ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారపేటకు చెందిన స్వరూప, చిన్న ఏడేళ్ల ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కొడుకు, కూతురు సంతానం. వీరిద్దరు టీవీ-9 ప్రజానగర్ కాలనీలో నివాసముంటున్నారు. చిన్న నిత్యం తాగి భార్యతో గొడవ పడుతుండేవాడు. శనివారం అర్ధరాత్రి పూటుగా తాగి భార్యతో గొడవ పడ్డాడు. అర్ధరాత్రి తర్వాత మద్యం మత్తులో నిద్రిస్తున్న చిన్నను సమీపంలో ఉన్న ఇనుప రాడ్డు తీసుకుని తలపై బాది హత్య చేసింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి స్వరూపను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. చిన్న తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. ఈ హత్యకు గల కారణాలను పోలీసులు పలు కోణాల్లో విచారిస్తున్నారు. స్వరూపకు ఏమైనా వివాహేతర సంబంధం ఉందా అనే విషయంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.

'26న లోకాయుక్తకు తరలి రండి'

కర్నూలు హాస్పిటల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న బోగస్ సర్టిఫికెట్ల బాధితులంతా ఈ నెల 26న లోకాయుక్త సంస్థ ఎదుట హాజరు కావాలని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. బోగస్ సర్టిఫికెట్ల బాధితులంతా జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా ధర్మ పోరాట ప్రతిజ్ఞ చేద్దామని, ఇందుకు అందురు హాజరు కావాలని రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, జేఏసీ రాష్ట్ర ప్రతినిధులు ముత్యాల బాలుడు, మునిరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బోగస్ సర్టిఫికెట్ల వారికే మెరిట్ పేరుతో ఉద్యోగాలు ఇచ్చి నిజమైన వారికి అన్యాయం చేసిన అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు.

పోయిన సొత్తు మూడు రోజుల్లోనే రికవరీ

బాధితులకు అప్పగించిన పోలీసులు

కర్నూలు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండులో బంగారు ఆభరణాలు ఉన్న ఓ బ్యాగ్ మరిచిపోయిన కుటుంబానికి మూడు రోజుల్లోనే పోలీసులు ఆ సొత్తును అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. సున్నిపెంట గ్రామానికి చెందిన రామిరెడ్డి, ఆయన భార్య ఈ నెల 21న ఓ వివాహం కార్యక్రమానికి కర్నూలు వచ్చారు. తిరిగి సున్నిపెంటకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. బస్సు ఎక్కే క్రమంలో బ్యాగును బస్టాండు ఆవరణలోనే మరిచిపోయారు. అందు లో 6 తులాల బంగారు నగలు, 10 తులాల వెండీ ఆభరణాలు, రూ.12 వేల నగదు ఉంది. కొంత దూరం వెళ్లిన తర్వాత తాము బ్యాగ్ మరిచిపోయామని గుర్తించి తిరిగి బస్టాండుకు వచ్చి చూస్తే కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా సీఐ మధుసూదన్‌గౌడు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేశారు. బస్టాండులోని సీసీ కెమెరాలను పరిశీలిస్తే ఓ వృద్ధ దంపతులు ఆ బ్యాగ్‌ను తీసుకెళ్లినట్లు గుర్తించారు. వారు ఎక్కిన బస్సు ఆదారంగా సంబంధిత బస్సు కండక్టర్, డ్రైవర్‌లను ఆరా తీస్తే వారు దిగిన ఊరు తెలిసింది. ఫొటోల ఆ ఊరిలో వాకబు చేస్తే ఆ వృద్ధ దంపతుల ఆచూకీ లభించింది. వారి దగ్గరకు వెళ్లగా బ్యాగును పోలీసులకు అప్పగించారు. మరిచిపోయి తమ బ్యాగు స్థానంలో వేరే బ్యాగు తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇంటికి వెళ్లిన తర్వాత చూస్తే నగలు కనిపించడంతో కంగారు పడిన దంపతులు ఎవరికి చెప్పాలో తెలియక ఆ బ్యాగు తమ వద్ద ఉంచుకున్నట్లు తెలిపారు. బ్యాగు పోగొట్టుకున్న దంపతులకు పోలీసులు బ్యాగ్‌ను అప్పగించారు. దీంతో పోలీసులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వంపై అసంతృప్తి: ఎస్టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగుల, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై కాలయాపన చేస్తుండటంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షనర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి అన్నారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో సురేష్ అధ్యక్షతన జిల్లా వార్షిక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, రాష్ట్ర ఆర్థిక కమిటీ సుంకన్న, డి.సుధీర్, ముర్తుజావలి, గోవిందు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఆందోళనలు : ఏపీటీఎఫ్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ ఆర్థిక రకాల బకాయిల చెల్లింపులు, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలల కాలంలో పీఎఫ్, ఏపీజీఎల్ఐ, డిటెక్షన్స్ రూపంలో రూ.2,500 కోట్లు ప్రభుత్వానికి చేరిందని, కనీసం వాటినైనా దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు చెల్లించాలని కోరారు.

5వ పేజీ తరువాయి

కర్నూలులో కృష్ణా బోర్డు పెట్టాలి..!

- శ్రీశైలం ప్రాజెక్టు కేంద్రంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ జరుగుతుంది. రెండు రాష్ట్రాలు విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాయి. నీటి వినియోగంలో తరుచుగా వివాదాలు తలెత్తున్నాయి.
- కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పర్యవేక్షణలో ప్రధాన ప్రాజెక్టులు జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ఉన్నాయి. శ్రీశైలం డ్యాం ఎగువన నికర జలాలు, వరద జలాల ఆదారంగా ఏపీలో గాలేరు-నగరి, తెలుగుగంగ, హంద్రీనీవా, వెలిగొండ, తెలంగాణ కల్వకుర్తి, నెట్టంపాడు, పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ వంటి కీలక ప్రాజెక్టులు కర్నూలుకు అత్యంత సమీపంలో ఉన్నాయి.
- తుంగభద్ర జలాలు, సుంకేసుల బ్యారేజీ, కేసీ కెనాల్, ఆర్డీఎస్ వంటి ప్రాజెక్టులకు నీటి పంపిణీ, తుంగభద్ర బోర్డు నీటి కేటాయింపులు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

రబీ సాగునీటిపై స్పష్టత ఇవ్వాలి

తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) కింద ఖరీఫ్‌లో 43,519 ఎకరాలు ఆయకట్టు ఉంది. 35 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని జూన్‌లో జరిగిన ఐఏబీలో తీర్మానించారు. 2024-25 నీటి సంవత్సరంలో ఎల్లెల్సీ వాటాగా 24 టీఎంసీలకు గానూ 21 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటికే 9.20 టీఎంసీలు వాడుకోగా.. 11.80 టీఎంసీలు మిగులు ఉన్నాయి. రబీలో 1,07,615 ఎకరాల ఆయకట్టు ఉండగా 45 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గాజులదిన్నె జలాశయంలో 2.80 టీఎంసీలు నిల్వ ఉంటే.. 0.65 టీఎంసీలు నీటి ఆవిరిపోనూ 2.10 టీఎంసీలు అందుబాటులో ఉంటుంది. వేసవి తాగునీటి అవసరాలు ఈ జలాశయంపై ఉన్నాయి. ఈ ప్రాజెక్టు కింద రబీ ఆయకట్టు 24,372 ఎకరాలు ఉంది. సాగునీరు ఇస్తారా.. లేదా..? అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. గురురాఘవేంద్ర ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువ, మైనర్ ఇరిగేషన్, ఏపీఎస్ఐడీసీ పథకాల ద్వారా సాగునీరు ఇచ్చే అవకాశాలు లేవని అజెండాలో ఉంచారు. జీడీపీ ఆయకట్టుకు సాగునీటిపై స్పష్టత ఇవ్వాలని జిల్లా రైతాంగం డిమాండ్ చేస్తోంది.

డిసెంబరు 3న కేఆర్ఎంబీ భేటీ

డిసెంబరు 3న కేఆర్ఎంబీ సమావేశం ఉంది. ఇప్పటికే అజెండా అంశాలను రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించారు. జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కర్నూలులో కృష్ణా బోర్డు ఏర్పాటు చేయాలని నేడు జరిగే ఐఏబీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేయాలి. అక్కడితో సరిపుచ్చుకుండా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలి. కేఆర్ఎంబీ సమావేశంలో ఈ అంశం కూడా అజెండాలో చేర్చి ఆమోదించేలా రాజకీయంగా తీవ్ర ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వన భోజనాలు హిందూ సంస్కృతికి చిహ్నాలు



బలిజసంఘం కార్తీక వనభోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె , నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజనాలు హిందూ సంస్కృతికి చిహ్నాలు అని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని కాశయ్యతోటలో మండల స్థాయిశ్రీకృష్ణదేవరాయల బలిజసంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీసీ ఇందిరమ్మ పాల్గొని బలిజసంఘం మహిళలతో ఉసిరి చెట్టుకు ప్రత్యేకపూజలు చేశారు. బలిజ సంఘం కుటుంబీకులు సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్‌జీఎం సంస్థల యజమాని శాంతిరాముడు , బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు రామసుబ్బయ్య, గురుజీ రామశేషయ్య, శ్రీరామ వెంకటసుబ్రహ్మణ్యం, శ్రీరాములు, టంగుటూరు శ్రీనయ్య పాల్గొన్నారు.
● మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో టీడీపీ నాయకుల ఆహ్వానం మేరకు వనభోజన వేడుకల్లో ఆదివారం బీసీ ఇందిరమ్మ పాల్గొన్నారు. అమ్మవారికి బీసీ ఇందిరమ్మ ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

- మృతి చెందిన మిత్రుల కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

ప్యాపిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2002-03 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఔదార్యం చాటారు. తమ బ్యాచ్‌కు చెందిన మాధవయ్య, నరసింహులు, మురళి, రామాంజినేయులు అనారోగ్య కారణాలతో మృతి చెందారు. దీంతో పూర్వ విద్యార్థులు స్నేహితుల కుటుంబాలను ఆదుకోవాలని భావించారు. ఒకరికొకరు ఫోన్‌లు చేసుకొని రూ.2.12లక్షలు జమా చేశారు. ఈ మొత్తాన్ని ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మృతి చెందిన స్నేహితుల ఒక్కో కుటుంబానికి రూ.53000 అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివ, రామచంద్ర, కిరణ్, బాలక్రిష్ణ, సురేష్, రాము, రమేష్, రామచంద్రగౌడు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు భార్గవ్‌రామ్ అన్నారు. ఆళ్లగడ్డ మండలంలో ఓబులంపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అబ్దుల్ నబీగారి మాబు హుసేన్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భార్గవ్‌రామ్ ఓబులంపల్లెకు చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి ఆదివారం నివాళి అర్పించారు. బాధితకుటుంబానికి ప్రభుత్వం, భూమా కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అన్నదాన కార్యక్రమం :
ఆళ్లగడ్డ పట్టణ ఆర్యవైశ్య మర్చంట్ అసోషియేషన్ ప్రెసిడెంట్ అలవాల చరణ్ ఆధ్వర్యంలో కార్తీక మాసం సదర్భంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పడకండ్ల గ్రామ సమీపంలోని తపోవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆర్యవైశ్యులు భార్గవ్‌రామ్‌ను ఘనంగా సత్కరించారు.

పద్మశాలీల సంక్షేమానికి కృషి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తామని ఆ సంఘం నూతన అధ్యక్షుడు కట్టా రామకృష్ణుడు అన్నారు. ఆళ్లగడ్డ పద్మశాలీయ, భద్రావతి భావనారాయణ స్వామి సేవా సంఘాన్ని సభాధ్యక్షుడు నీలకంఠం ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో గౌరవాధ్యక్షుడిగా సుబ్బ తులసీకృష్ణ, గౌరవ సలహాదారుడిగా నీలకంఠేశ్వరుడు, అధ్యక్షుడిగా కట్టా రామకృష్ణుడు, నలుగురు ఉపాధ్యక్షులతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడు సంవత్సరాల పాటు పద్మశాలీయుల అభివృద్ధికి పాటుపడతామని కార్యవర్గ సభ్యులు వెల్లడించారు.

నైనాలప్ప తిరుణాల ప్రారంభం

సంజామల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటైన నైనాలప్ప క్షేత్రంలో ఆదివారం తిరుణాల ప్రారంభమైంది. అక్కంపల్లె కొండల్లో వెలిసిన నైనాలప్ప క్షేత్రానికి భక్తులు తండోపతండాలుగా చేరుకొని క్షేత్రంలో వెలిసిన ఓంకారేశ్వరుడికి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆదివారం స్వామి వారి ఉత్సవాలకు అంకురార్పన , ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సోమవారం స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. టీడీపీ నాయకులు గుర్రా రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పించారు. సోమవారం జరిగే రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించేందుకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'సుజాతమ్మకు క్యాబినెట్ హోదా పదవి ఇవ్వాలి'

డోన్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మకు రాష్ట్ర ప్రభుత్వంలో క్యాబినెట్ హోదా పదవి ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు కోరారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆలూరు టికెట్ త్యాగం చేసిన కోట్ల సుజాతమ్మకు ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే సముచిత స్థానం ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్పొరేషన్ చైర్మన్ పదవిని కేటాయించి న్యాయం చేయాలని కోరారు.

భగవద్గీతను అనుసరించాలి

కొలిమిగుండ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భగవద్గీతను అనుసరిస్తే మనిషి జీవితం ధన్యమవుతుందని ప్రబోధ సేవాసమితి, త్రైతసిద్ధాంతం స భ్యులు బాబు, సురేష్, హరి అన్నారు. ఆదివారం మండలంలోని కమ్మవారిపల్లెలో ఇందూ జ్ఞాన వేదిక త్రైత సిద్ధాంతం సభ్యులు భగవద్గీత ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. గ్రంథాలను పంపిణీ చేశారు. పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో కాశీ యాత్రికుడి మృతి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆళ్లగడ్డ మండలం బత్తులూరు గ్రామానికి చెందిన యాత్రికుడు శేషయ్య(65) మృతి చెందాడు. తీర్థయాత్రలకు వెళ్లిన కుటుంబ పెద్ద ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

మహిమాన్వితుడు నేలబిళం మల్లేశ్వరుడు

- మునీశ్వరులు తపస్సు చేసిన క్షేత్రంగా ప్రసిద్ధి
- నేడు శివపార్వతుల కల్యాణం, రథోత్సవం



నేలబిళం మల్లేశ్వరస్వామి ఆలయం

కొలిమిగుండ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల మండలంలోని మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో కొండల్లో వెలసిన నేలబిళం మల్లేశ్వరస్వామి క్షేత్రం కొలిచే భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతోంది. మండలంలోని అతి పురాతన ఆలయాల్లో నేలబిళం మల్లేశ్వరస్వామి ఆలయ చరిత్ర అత్యంత పవిత్ర, ప్రాముఖ్యత కలిగినదిగా ఈప్రాంత వాసుల నమ్మకం. మండలంలోని బందార్లపల్లె గ్రామ సమీపాన గుహల ప్రాంతంలో వెలసిన ఈ ఆలయంలో ప్రతి ఏటా కార్తీక మాసంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. కార్తీక మాసంలో ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. కార్తీక మాసం కడ సోమవారం వేలాది మంది భక్తజన సందోహం మధ్య శివపార్వతుల కల్యాణం, స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆలయ ఆవరణంలో నెలకొన్న బిళం (గుహ)కు ఎంతో చరిత్ర ఉంది. పూర్వ కాలం ఈ బిళంలో మునీశ్వరులు తపస్సు చేస్తూ ఉండేవారని, మునీశ్వరులు గుహ నుంచి బయటికి వచ్చి స్వామిని దర్శించు కునే వారని ఆలయ చరిత్ర చెబు తోంది. మహిమాన్వితమైన నేలబి ళం మల్లేశ్వరస్వామి క్షేత్రాన్ని కార్తీక మాసంలో దర్శించుకొని బిళం (గుహ) లోని నీటిని తలపై చల్లుకొని, పూజలు చేస్తే పునీతులవుతారని భక్తుల నమ్మకం.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: మంత్రి



మంగపల్లెలో వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్ల మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. బనగానపల్లె మండలంలోని గులాంనబీపేట వద్ద జరుగుతున్న రోడ్డు ప్యాచింగ్ పనులను మంత్రి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి రోడ్ల ప్యాచింగ్ మరమ్మతు పనులపై సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా లోపం లేకుండా పకడ్బందీగా గుంతలను పూడ్చాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించాలని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం
బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీచౌడేశ్వరీ దేవస్థానానికి వెంకటేశ్వర మైన్స్ అండ్ మినరల్స్ యాజమాని ఏవీ.సుబ్బారెడ్డి రూ. 3.16లక్షల చెక్కును ఆదివారం రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా గ్రామ పెద్దలకు అందించారు. కార్యక్రమంలో కొలిమిగుండ్ల టీడీపీ మండల కన్వీనర్ మూలే రమేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, సోమనాథ శంకర్ రెడ్డి, బండి వెంకటరామిరెడ్డి, దిద్దికాటి పుల్లారెడ్డి, బండిప్రతాప్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయం
సంజామల : సేవా తత్పరుడు డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి అని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మెగా వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆదివారం మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో జరిగిన 50వ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంత్రి బీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో మంత్రి మాట్లాడారు. సేవ చేయాలని ప్రతి ఒక్కరూ అను కుంటారని, కానీ ఆ భాగ్యం దస్తగిరి రెడ్డి లాంటి కొందరికే దక్కుతుందని మంత్రి అన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు కాణాల కేశవ రెడ్డి, బెలుం సురేష్ రెడ్డి, మంచాల మద్దిలేటి రెడ్డి, శంకర్ రెడ్డి, టీడీపీ మండల ఇన్‌చార్జి బత్తుల వెంకట ప్రతాప్ రెడ్డి, మంగపల్లె చంద్రశేఖర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మల్కి హుసేన్, మాధవ, మద్దిలేటి, సుబ్బారావు, రవి పాల్గొన్నారు.

1500 మందికి ఉచిత వైద్య సేవలు
మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 1500మంది రోగులకు కర్నూలు, నంద్యాల పట్టణానికి చెందిన వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు.

బోధనకే పరిమితం చేయాలి



వెంకటయ్య, సత్యప్రకాశ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు విష్ణుశేఖర్‌రెడ్డి

కోవెలకుంట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని యూటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్ కోరారు. ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో సీవీ ప్రసాద్ అధ్యక్షతన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల బలోపేతం ద్వారానే ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోగలమన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమైక్యంగా ఉద్యమించాలన్నారు. నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర కౌన్సిలరు ఐజయ్య, నాగస్వామినాయక్, కె.సుజాత. జిల్లా సహా అధ్యక్షులు సత్యప్రకాశ్, శాంతిప్రియ, ఆర్థిక కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, అఫిజ్ రామ్మోహన్, రామనందకిశోర్, షమీమ్‌భాను, రామకృష్ణుడు, నరసింహారెడ్డి, సుబ్బరాయుడు, సంజీవరాయుడు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేసినప్పుడే గుర్తింపు
ప్రభుత్వ ఉద్యోగులు విధుల పట్ల అంకితభావంతో పని చేసినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని టీడీపీ నాయకులు నందిరెడ్డి విష్ణుశేఖర్‌రెడ్డి అన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు వెంకటయ్య, సత్యప్రకాశ్, టీడీపీ నాయకుడు విష్ణుశేఖర్‌రెడ్డిని యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాలనాయకులు వడ్డెసుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, సీపీయం నాయకులు సుధాకర్, బ్రహ్మయ్య, భూపాల్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారమే ఎస్టీయూ ధ్యేయం'

బేతంచెర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్టీయూ పని చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్ అన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల కొత్తపేటలోలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు పి.లోకానాథ్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డా.టి.సురేష్ బాబు, ఫిజిక్స్‌లో డాక్టరేట్ సాధించిన పి.రాంప్రసాద్, ఏవీ వప్రసాద్, పి.లక్ష్మి రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకు లు ఇక్బాల్ బాషా, సుంకన్న, శ్రీనివాస కుమార్, నాగరాజు, మునీంద్ర, దేవేంద్రప్ప, మద్దిలేటి, నారాయణ, రామచంద్రుడు, పరమేష్, నందప్ప, రవికుమార్, రామ్మోహన్, మన్సూర్, వెంకటేశ్, చిన్నపరెడ్డి, చంద్రమౌలి పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు మహోత్సవాలు

డోన్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటలో వెలసిన హజరత్ హసన్‌వలి మౌలాలి స్వాముల ఉరుసు మహోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ముగిశాయి. ఉరుసు మహోత్సవాల ముగింపు సందర్భంగా కిస్తీ ఘనంగా నిర్వహించారు. కిస్తీ బండిని వీధుల గుండా ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మౌలాలి స్వామి దర్గా కమిటీ అధ్యక్షుడు ఎస్‌ఏ చిన్న రెహిమాన్, సభ్యులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం



వనభోజనం కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గౌడ సంఘం నాయకులు

డోన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, శివసాయి గురూజి కదిరప్పస్వామి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీఈ రామకృష్ణగౌడు, భాస్కర్‌గౌడు, బాష్యం శ్రీనివాసులు గౌడు, న్యాయవాదులు అంజనేయగౌడు, మధుసూదన్‌గౌడు, టీఈ రాఘవేంద్రగౌడు, మద్దిలేటిగౌడు, కంబలపాడు రంగస్వామి గౌడు, వెంకటేశ్‌గౌడు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ఆలయాల్లో కార్తీక మాస ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఇంజేడు గ్రామ శివాలయంలో అర్చకుడు ప్రసాద్, ఉయ్యాలవాడలో పార్వతీదేవికి అనంతయ్య, ఆర్.జంబులదిన్నెలో ఆంజనేయస్వామికి అర్చకుడు కీర్తి లక్ష్మణస్వామి అభిషేకం అలంకరణ చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు

రుద్రవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం భాస్కర నందీశ్వరాలయంలో ధ్వజస్తంభానికి వంద కేజీల ఇత్తడితో తొడుగు ఏర్పాటు చేసినట్లు టీడీపీ నాయకులు, ఆలయ నిర్వాహకులు ఏరువ క్రిష్ణమూర్తి ఆదివారం తెలిపారు. ఇత్తడి తొడుగులు తిరుపతిలో చేయించినట్లు ఆయన తెలిపారు. ధ్వజస్తంభానికి ఆకాశదీపం ఏర్పాటు చేసి ప్రారంభించారు. శివాలయంలో భాస్కరనందీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

సంతాన వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు
రుద్రవరంలో సంతాన వేణుగోపాలస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నిత్యతృప్తదాస్ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు సంతాన వేణుగోపాలస్వామికి సత్యభామ రుక్మిణీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గీతాపారాయణం చేశారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవలు మరువలేనివి



నరసింహారెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సేవా సమితి సభ్యులు

ఉయ్యాలవాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశానికి చేసి సేవలు మరువలేనివని టీడీపీ సీనియర్ నాయకుడు కూడాల నారాయణరెడ్డి అన్నారు. నరసింహారెడ్డి 218వ జయంతి వేడుకలను రేనాటి సూర్య చంద్రుల సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నరసింహరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు నరసింహారెడ్డి జీవిత చరిత్ర గుర్తు ఉండేలా పాఠ్యపుస్తకాల్లో లిఖించాలన్నారు.

రేనాటి సూర్యచంద్రుల మ్యూజియం ఏర్పాటు చేయాలి
రేనాటి సూర్య చంద్రులుగా పిలువబడే తొలి స్వాతంత్ర్య సమరయోదుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, దాన కర్ణుడిగా పిలువబడే బుడ్డా వేంగళరెడ్డిల మ్యూజియం ఏర్పాటు చేయాలని రేనాటి సూర్యచంద్రుల సేవా సమితి అధ్యక్షుడు, జనసేనా మండల అధ్యక్షుడు డీకే బాబు కోరారు. దేశ ప్రజలకు వారి జీవిత చరిత్ర తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవచూపాలని ఆయన కోరారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

రుద్రవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దారు మల్లిఖార్జునరావు తెలిపారు. ఆదివారం యల్లావత్తుల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 51 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు.

చాగలమర్రి: మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్‌సత్తార్ తెలిపారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి 70 దరఖాస్తులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబు తెలిపారు. హరివరం గ్రామంలో దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించామన్నారు. మండలంలో ఫారం-6 కింద 22, ఫారం-7కు 4, ఫారం 8కు 44 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వీఆర్వో గోపాల్, బీఎల్‌వో శిరీష ఉన్నారు.

అధిక లోడుతో వెళితే భారీ జరిమానాలు



తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

బేతంచెర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అధిక లోడుతో నాపరాళ్లను తరలిస్తే భారీగా జరిమానా విధిస్తామని ఎస్‌ఐ రమేష్ బాబు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎస్‌ఐ వాహనాల తనిఖీలు చేశారు. పలుకూరు నాపరాళ్ల గనుల నుంచి ప్యాక్టరీలకు వచ్చే ట్రాక్టర్ డ్రైవర్ల లైసెన్సులు తనిఖీ చేశారు. లైసెన్స్ లేని డ్రైవర్లకు జరి మానాలు విధించారు. వాహనాలను సీజ్ చేసి డోన్ ఎంవీఐకి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాయిబాబా ఆలయ నిర్మాణానికి విరాళం



ధర్మవరం సుబ్బారెడ్డికి విరాళం చెక్కును అందజేస్తున్న అంబటి వెంకటసుబ్బారెడ్డి

డోన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని షిరిడీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి బేతంచెర్లకు చెందిన వెంకటేశ్వర మైన్స్ అండ్ మినరల్స్ ట్రాన్స్‌పోర్టు అధినేత అంబటి వెంకట సుబ్బారెడ్డి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎంఎస్‌ఆర్ కార్యాలయంలో రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డికి ఆయన చెక్కును అందజేశారు. విరాళం ఇచ్చిన వెంకటసుబ్బారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సాయి కమిటీ సభ్యులు సీఎం శ్రీనివాసులు, కొండా సురేష్, ఆలా మల్లికార్జునరెడ్డి, కందుకూరు పార్థసారధి, వ్యాపారవేత్తలు మహేశ్వరరెడ్డి, షేక్షావలి చౌదరి పాల్గొన్నారు.

నేడు డోన్ ఎమ్మెల్యే రాక

డోన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సోమవారం డోన్ పట్టణానికి వస్తున్నట్లు ఆదివారం పార్టీ నాయకులు తెలిపారు. సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.25లక్షల చెక్కులను ఎమ్మెల్యే కోట్ల సంబంధిత బాధితులకు అందజేస్తారన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి పట్టణంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి : బీసీ రాజారెడ్డి



బీసీ రాజారెడ్డిని సత్కరిస్తున్న అరుణ్‌కుమార్ నాయక్

బనగానపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనులు ఆర్థికంగా బలోపేతం కావాలని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఏపీ గిరిజన కార్పొరేషన్ డైరక్టర్‌గా అరుణ్‌నాయక్‌కు నామినేటెడ్ పోస్టు రావడం అభినందనీయమన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని కార్యాలయంలో బీసీ రాజారెడ్డి అరుణ్‌నాయక్‌ను అభినందించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి వెంకటరాముడు నాయక్, టీడీపీ నాయకుడు కృష్ణానాయక్, అవుకు పట్టణ నాయకులు, జిల్లా గిరిజన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ
అవుకు : అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మారం పుల్లారెడ్డిని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆదివారం పరామర్శించారు. మారం పుల్లారెడ్డి కాలు ఫ్యాక్చర్ కావటంతో కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బీసీ రాజారెడ్డి రామాపురం పుల్లారెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

చాగలమర్రి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని దూదెకుల సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాష అన్నారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. బీసీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిందని అన్నారు. కార్పొరేషన్ల ద్వారా బీసీలకు నిధులు మంజూరు చేసి ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో బీసీల నిధులు నిర్వీర్యం చేసి అన్యాయం చేసిందని అన్నారు. కార్యక్రమంలో దూదెకుల సంఘ సభ్యులు పీరయ్య, లాల్‌బాష, సుబ్బరాయుడు, ఇమామ్‌బాష, పక్రుద్దిన్, సమ్మద్, లాలు పాల్గొన్నారు.

అన్నాభిషేక అలంకరణలో ఈశ్వరస్వామి



అన్నాభిషేక అలంకారంలో ఈశ్వరుడు

చాగలమర్రి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో కార్తీకమాసం సందర్భంగా ఈశ్వరస్వామి అన్నాభిషేక అలంకారంలో కొలువుదీరారు. మండల సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా ఈశ్వరస్వామికి అన్నాభిషేకం అలంకారం చేశారు. ప్రత్యేక పూజలు, అబిషేకాలు చేశారు. పార్వతీ దేవికి సామూహిక ఒడిబియ్యం సమర్పించారు. విష్ణు సహస్రపారాయణం, పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితుడు నాగభూషణం, ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ముళ్ల కంపలు తొలగింపు

కోవెలకుంట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల నుంచి బనగానపల్లె రహదారిలో ఇరువైపులా ఉన్న ముళ్లకంపలు తొలగించి హద్దులు గుర్తించి రాళ్ల పాతించామని ఈవోపీఆర్‌డీ, కోవెలకుంట్ల ఇన్‌చార్జి ఈవో ప్రకాశ్‌నాయుడు ఆదివారం తెలిపారు. కరెంటు స్తంభాలను పాతించామన్నారు. రోడ్డును ఆక్రమించిన ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్యాపిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ మధుసూదన్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో మండలంలోని పెద్దపూదిళ్ల, పోతుదొడ్డి, ప్యాపిలి రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సమస్య వచ్చిన పోలీసుల దృష్టి తీసుకరావాలన్నారు. గొడవలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుహల వద్ద సందర్శకుల సందడి

ప్యాపిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాల్మీకి గుహల దగ్గర ఆదివారం సందర్శకులు సందడి చేశారు. క్రిష్ణగిరి, బూరుగుల, అనంతపురం తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు గుహల సందర్శన కోసం వచ్చారు. గుహల దగ్గర ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. గుహలు అద్భుతంగా ఉన్నాయని పర్యాటకులు కితాబు ఇచ్చారు.

నందివర్గం డీలర్ సస్పెన్షన్

బనగానపల్లె , నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని నందివర్గం డీలర్‌గా ఉంటూ నందివర్గం వైసీపీ ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్న నారాయణను సస్పెన్షన్ చేస్తూ డోన్ ఆర్‌డీవో నరసింహులు ఉత్తర్వులు జారీ చేసినట్లు బనగానపల్లె తహసీల్దారు నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. నారాయణ నందివర్గం డీలర్‌గా ఉంటూ నిబంధనలకు విరుద్ధంగా ఎంపీటీసీ పదవిలో కొనసాగుతున్నట్లు తహసీల్దారు తెలిపారు. ఒకే వ్యక్తి రెండు ప్రభుత్వ పదవుల్లో ఉంటూ రెండు గౌరవ వేతనాలు తీసుకోవడం చట్ట విరుద్ధమన్నారు. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదికను డోన్ ఆర్‌డీవోకు సమర్పించినట్లు తెలిపారు. డీలర్‌గా నారాయణను ఆర్‌డీవో సస్పెండ్ చేసినట్లు తహసీల్దారు వెల్లడించారు.